క్లుప్తంగా

బిల్లులు సకాలంలో చెల్లించండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి మెరుగైన సేవలందించేందుకు సహకరించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.సుబ్బన్న శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

1 నుంచి హాకీ శిబిరం

కర్నూలు (టౌన్): మే 1 వ తేదీ నుంచి హాకీ కర్నూలు అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో (పాత కంట్రోల్ రూమ్) హాకీ సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు హాకీ కార్యదర్శి దాసరి సు.దీర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు శిక్షణ ఉంటుందని, శిబిరం ముగిసిన తరువాత క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు.

కమిటీ ముమ్మర విచారణ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో ప్రశ్నపత్రాన్ని ఇన్విజిలేటర్ ఫొటో తీసిన ఉదంతంపై కమిటీ ముమ్మర విచారణ చేపట్టింది. శనివారం ఉదయానికంతా నివేదిక ఇవ్వాలని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆదేశించారు. ఈ మేరకు విచారణ కమిటీని ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ నియమించారు. కమిటీలో ఫోరెన్సిక్ హెచ్‌ఓడీ డాక్టర్ సాయిసుధీర్, క్యాన్సర్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్, ఫార్మకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ విజయభాస్కర రెడ్డి ఉన్నారు. ఇన్విజిలేటర్‌గా వ్యవహరించిన మైక్రోబయాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చక్రపాణియాదవ్‌ను పిలిపించి ప్రిన్సిపాల్ ఆధీనంలోని అతని సెల్‌ఫోన్, అందులోని డేటా ఆధారంగా కమిటీ విచారణ చేస్తోంది.

దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(టౌన్): భారత గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ స్వచ్ఛ తులిప్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న ఇంటర్న్‌షిప్ శిక్షణకు ఔత్సాహికులు వచ్చే నెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పట్టభద్రులు, డిప్లొమా, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు స్వచ్ఛ భారత్, సిటిజన్ అవుట్ రీచ్ సర్వే, వ్యర్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణకు హాజరయ్యే వారికి పారితోషికం ఉంటుందని, వివరాలకు https://internship.aicte-india.org వెబ్‌సైట్‌ను సందర్శించాలని లేదా 97016 42001 ఫోన్ నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

కోర్టు ఉద్యోగాల భర్తీపై హర్షం

కర్నూలు(లీగల్): జ్యుడీషియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.వై.కృష్ణ నేతృత్వంలో శుక్రవారం కర్నూలు జిల్లా కోర్టులోని ఉద్యోగులందరూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ మిశ్రా, న్యాయమూర్తుల కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో దాదాపు 4,500 ఉద్యోగాలను హైకోర్టు భర్తీ చేసిందన్నారు. తద్వారా ఉద్యోగులపై భారం తగ్గించడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు లభించాయన్నారు. కర్నూలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఎన్.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ జనరల్ లక్ష్మణరావు తదితరులు ధన్యవాదాలు తెలిపారు.

ఆహార పరిశ్రమకు కొత్త రూపు

కర్నూలు సిటీ: ఆహార పరిశ్రమ కొత్త రూపు సంతరించుకుంటోందని ఐఐఐటీ డీఎం డైరెక్టర్ డీవీఎల్ఎన్ సోమయాజులు అన్నారు. శుక్రవారం విజయవాడలోని బెంజ్ సర్కిల్ సమీపంలోని వేదిక ఫంక్షన్ హాలులో ఎంఎస్ఎంఈ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో గ్లోబల్ ఫుడ్ బాస్కెట్-2023 వర్క్‌షాపులో గ్లోబల్ టెక్నాలజీ ఇంటర్వెన్షన్స్ అండ్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్-ఫుడ్ వాల్యూచైన్ అనే అంశంపై జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. రసాయన రహిత ఆర్గానిక్ ఫుడ్ అంతర్జాతీయ ఆమోదాన్ని పొందిందని వివరించారు. ఆ ఇన్‌స్టిట్యూట్ రిజిస్ట్రార్ కె.గురుమూర్తి మాట్లాడారు. ఐఐఐటీడీఎం (కర్నూలు) సాంకేతిక విద్య పరంగా ఉన్నత ప్రమాణాలతో కూడిన విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దుతున్నందుకు ఆచార్య డీవీఎల్ఎన్ సోమయాజులు గ్లోబల్ ఫుడ్ బాస్కెట్ (జీఎఫ్‌బీ)-2023 అవార్డు అందుకున్నారు. ఎంఎస్ఎంఈసీ చైర్మన్ దేవరాజు దాసరి, డబ్ల్యూఎస్ఎంఈ కార్యనిర్వాహక కార్యదర్శి డా.సంజీవ్ లాయోక్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

కర్నూలు సిటీ: కోడుమూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ఇటీవలే తెర్నెకల్లు హైస్కూల్‌కు పనిసర్దుబాటు కింద వెళ్లిన జె.వీరభద్రయ్య గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసయాదవ్, ఎంఈఓ అనంతయ్య తదితరులు శుక్రవారం నగరంలోని ఆయన స్వగృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ :పొన్నియిన్ సెల్వన్-2, ఏజెంట్, విరుపాక్ష, సిసు, ఇవిల్‌డెడ్ రైజ్, శాకుంతలం, దసరా
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : ఏజెంట్, పొన్నియిన్ సెల్వన్-2, విరుపాక్ష, దసరా, సిసు, విద్యార్థి, ఇవిల్‌డెడ్ రైజ్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : ఏజెంట్, విరుపాక్ష
ఐనాక్స్ : ఇవిల్‌డెడ్ రైజ్, సిసు, కిసీ కా భాయ్ కిసీ కా జాన్, పొన్నియిన్ సెల్వన్-2, బెరా ఏక్ అఘోరి, సుజుమె
భరత్ కాంప్లెక్స్ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్, ఇవిల్‌డెడ్ రైజ్, దసరా
శ్రీరామ : ఏజెంట్
రాజ్ : పొన్నియిన్ సెల్వన్-2
విజయ : విరుపాక్ష

నృత్యం.. యువనర్తనం

- నృత్యం నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్న యువత
- అందుబాటులో సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులు
- నేడు అంతర్జాతీయ నృత్య దినోత్సవం

నృత్య శిక్షణ కేంద్రాల వివరాలు

- ఉమ్మడి జిల్లాలో నృత్య శిక్షణ కేంద్రాలు: 180
- కర్నూలు నగరంలో: 20

కోర్సుల వివరాలు:
ప్రభుత్వ నృత్య కళాశాలలో: 4ఏళ్ల సర్టిఫికెట్ కోర్సు
2 ఏళ్ల డిప్లమా కోర్సు
- ప్రైవేట్ శిక్షణ కేంద్రాల్లో:
సంప్రదాయ నృత్యం : ఏడాది కోర్సు
పాశ్చాత్య నృత్యం: 3 నెలలు



ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాలలో నృత్యం నేర్చుకుంటున్న విద్యార్థులు

కర్నూలు కల్చరల్: శాస్త్రీయ నృత్య రీతులు భారతీయ సంస్కృతికి ప్రతిరూపాలు. నవరసాల్లో ఒదిగిన ఈ నాట్య కళ మనిషి సర్వోతముఖీయమైన వికాసానికి సాధనం. నాట్యం చేస్తున్నప్పుడు కళాకారులు ప్రపంచాన్ని మరిచిపోతారు. ఈ కళ సాధన చేసిన వారిలో ఏకాగ్రత, ఆత్మస్థైర్యం, పట్టుదల ముఖ్యంగా జ్ఞాపక శక్తి పెరుగుతుందని పలు పరిశోధనల్లో వెల్లడైంది. నృత్యాన్ని మించిన వ్యాయామం లేదంటున్నారు నిపుణులు. ఓ గంట పాటు నృత్య సాధన చేస్తే జిమ్, ఏరోబిక్స్ అవసరమే లేదంటున్నారు. అంతర్జాతీయ నృత్యకారుడు జీన్ జార్జెస్ నొవెర్రి జన్మదినం ఏప్రిల్ 29. ఆ రోజును అంతర్జాతీయ నృత్య దినోత్సవంగా నిర్వహించాలని 1982లో నిర్ణయించారు. అప్పటి నుంచి ఏటా 'అంతర్జాతీయ నృత్య దినోత్సవం' నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

సర్వ సంపన్నం.. నాట్య కళ

మనసులోని భావాన్ని ప్రకటితం చేయడానికి ప్రదర్శనా రూపంగా ఎంచుకున్న కళ నృత్యం. హావభావాలకు లయ, సంగీతం జోడించి కంటికింపు కలిగేలా నృత్యాన్ని సృష్టించారు పూర్వీకులు. సామాజిక దృక్పథాన్ని, పురాణ ఇతిహాసాలను మంచి చెడులను ప్రచారం చేయడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. నృత్య కళాకారులు, నృత్య శిక్షకులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ జిల్లాకు గుర్తింపు తెస్తున్నారు.

ఆకట్టుకుంటున్న ఆధునిక నృత్య రీతులు

శాస్త్రీయ నృత్యాలైన భరతనాట్యం, కూచిపూడితో పాటు ఆధునికమైన అనేక నృత్యరీతులు ప్రచారంలోకి వచ్చాయి. బెల్లీ, గంగ్నమ్, సల్సా, జుంబా, ట్వెర్కింగ్, సాంబా, మాంబో వంటి ఆధునిక నృత్య రీతులకు చిన్నారులు, కుర్రకారు దాసోహం అంటున్నారు. జిగేల్ మనే నియాన్ దీపాల వెలుగులు, లౌడ్ స్పీకర్లకే చిల్లులు పడతాయా అన్నట్లుగా హోరెత్తే శబ్దాలు, లోకాన్ని మరిచిపోయి డీజేలు సృష్టిస్తున్న సంగీత హోరులో యువతరంగాలు ఊగిపోతున్నారు.

పెరుగుతున్న శిక్షణ సంస్థలు

నృత్యం కొందరికి సర్వస్వం. మరికొందరికి జీవనోపాధి. ఇంకొందరికి సరదా. మొత్తం మీద సంప్రదాయ నృత్య కళలకు ఆదరణ నానాటికీ పెరుగుతోంది. అదే సమయంలో ఆధునిక నృత్యాలపైనే ఆసక్తి పెరుగుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పెరుగుతున్న నృత్య శిక్షణ కేంద్రాలే దీనికి నిదర్శనం. ఆసక్తిగా నేర్చుకుంటున్న వారిలో చిన్న పిల్లలు, యువత, ముఖ్యంగా మహిళలు ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారు.

రాయలసీమలో ఏకైక ప్రభుత్వ కళాశాల

కర్నూలు ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాల రాయలసీమలోనే ఏకైక శిక్షణ కేంద్రం. ఇక్కడ సంగీతంతో పాటు శాస్త్రీయ నృత్యంలో శిక్షణ ఇస్తున్నారు. ఈ కళాశాలలో వివిధ జిల్లాల విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. కర్నూలుతో పాటు నంద్యాల, ఆదోని, డోన్, ఎమ్మిగనూరు, నందికొట్కూరు, ఆళ్లగడ్డ, మంత్రాలయం, కోడుమూరు ఇలా అన్ని పట్టణాల్లో నృత్య శిక్షణ కేంద్రాలు వెలిశాయి. వేసవి సెలవుల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. వారంతాల్లో కూడా తరగతులు ఏర్పాటు చేస్తున్నారు. శాస్త్రీయ నృత్యంతో పాటు ఆధునిక, పాశ్చాత్య నృత్య రీతులకు అదే స్థాయిలో ఆదరణ లభిస్తోంది.

సర్వ కళా సమాహారం

నృత్యంలో సర్వ కళలు మిళితమై ఉన్నాయి. ఈ కళ సాధన వల్ల సంగీతం, సాహిత్యం, లయ, అభినయంపై అవగాహన కలుగుతుంది. మానసికోల్లాసం, మంచి శరీర ధారుఢ్యం, ఏర్పడుతుంది. ఇటీవల కాలంలో నృత్యం నేర్చుకునే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. శాస్త్రీయ నృత్యానికి ఎప్పటికి ఆదరణ ఉంటుంది. ఆధునికతకు అనుగుణంగా మన నృత్యాల్లో చాలా మార్పులు వస్తున్నాయి.

– మునికుమార్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాల, కర్నూలు

డ్యాన్స్ టీచర్‌గా రాణిస్తున్నా



కర్నూలు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో శాస్త్రీయ నృత్యంలో శిక్షణ పొందాను. చాలా మంది ఆడపిల్లలకు ఈ డ్యాన్స్‌లేంటి అన్నారు. ఇదేమైనా ఫుడ్ పెడుతుందా అని హేళన చేశారు. అయినా మా కుటుంబ సభ్యుల సపోర్ట్‌తో నృత్యం నేర్చుకున్నాను. ప్రస్తుతం డ్యాన్స్ టీచర్‌గా ప్రముఖ విద్యా సంస్థలో ఉద్యోగం చేస్తున్నాను. ప్రస్తుతం అదే మాకు ఫుడ్ పెడుతుంది.

– సాయి చరణ్య, నృత్య శిక్షకులు, కర్నూలు

పేదల ఇళ్లలో సంక్షేమ వెలుగులు



వీకర్‌సెక్షన్ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని, ఎమ్మెల్సీ పోతుల సునీత

కల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు ప్రకాశిస్తున్నాయని ఎమ్మెల్సీ, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పోతుల సునీత, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం 27, 41వ వార్డుల్లోని వెంకటాద్రినగర్, వీకర్ సెక్షన్ కాలనీలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులో ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే గడప గడపకు వస్తున్నామన్నారు. గతంలో అధికారంలో ఉన్న సమయంలో టీడీపీ ప్రజలకు ఏం చేసిందని, ఇప్పుడు వారు వచ్చి చేసే తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో 37వ వార్డులో దాదాపు రూ.కోటి నిధులతో డ్రైనేజీల సమస్య పరిష్కరించామన్నారు. ఆయా కాలనీలవాసులు సమస్యలను తెలియజేయగా సకాలంలో పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ మేయర్ రేణుక, అవుకు జెడ్పీటీసీ చల్లా శ్రీలక్ష్మి, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.పుల్లారెడ్డి, సాయి, సిద్దు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో పురుషుల హాజరు శాతం తక్కువ



మాట్లాడుతున్న డ్వామా పీడీ అమరనాథరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చేపట్టే పనులకు పురుషుల హాజరు శాతం తక్కువగా ఉందని డ్వామా పీడీ అమరనాథరెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని గోకులం సమావేశ మందిరంలో జిల్లా సమాఖ్య కార్యవర్గ సమావేశం డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య, జిల్లా మహిళ సమాఖ్య అధ్యక్షురాలు సీతాబాయి అధ్యర్యంలో జరిగింది. లైన్ డిపార్టుమెంట్ అధికారులు పాల్గొన్నారు. డ్వామా పీడీ మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కింద మహిళల జీవనోపాధుల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య వివరించారు.ఎల్‌డీఎం మాట్లాడుతూ.. బ్యాంకుల ద్వారా పొదుపు మహిళలకు లింకేజీ రుణాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పశుసంవర్ధకశాఖ జేడీ రామచంద్రయ్య, ఉద్యాన అధికారి మహబూబ్‌బాషా, డీఆర్‌డీఏ-వైకేపీ డీపీఎం రెహ్మాన్ పాల్గొన్నారు.

రిటైర్డ్ డీఎస్పీ కన్నుమూత



శివశంకర్‌రెడ్డి (ఫైల్)

కర్నూలు: జిల్లా పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలందించిన రిటైర్ అయిన డీఎస్పీ శివశంకర్ రెడ్డి (73) అనారోగ్యంతో హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందారు. కడప జిల్లా పులివెందుల తాలూకా సుంకేసుల గ్రామానికి చెందిన శివశంకర్ రెడ్డి 1978లో ఎస్ఐ హోదాలో పోలీసు శాఖలో చేరి జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తూ 2009లో ఇంటలిజెన్స్ విభాగంలో డీఎస్పీ హోదాలో పదవీ విరమణ పొందారు. అనంతరం హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఉంటున్నారు. శనివారం ఉదయం హైదరాబాద్ జూబ్లీ హిల్స్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జిల్లాలో ఆయనతో పాటు పనిచేసిన పలువురు అధికారులు నివాళులర్పించేందుకు హైదరాబాద్‌కు తరలి వెళ్లారు.

బాధిత కుటుంబానికి పరిహారం ఇవ్వాలి



మార్కెట్‌యార్డు కార్యాలయం ధర్నా చేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో పనిచేస్తూ మృత్యువాత పడిన హమాలీ సర్వేశ్వర రెడ్డి కుటుంబానికి రూ.10 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం మార్కెట్ యార్డులో కమిటీ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపట్టింది. మార్కెట్ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో సీఐటీయూ ఉపాధ్యక్షుడు గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ.. యార్డులో రైతులు, కార్మికులకు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, దిగుబడులు అమ్ముకోవడానికి వచ్చిన రైతులు, మార్కెట్‌లో పనిచేసే కార్మికులకు ఉచిత ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని కోరారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున మార్కెట్‌లో తాగునీటి సదుపాయం, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సెక్రటరీ గోవిందు స్పందిస్తూ మార్కెట్ యార్డులో కనీస సౌకర్యాలు కల్పిస్తామని, తాగునీటి సదుపాయం, చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మరణించిన వారి కుటుంబాలకు పరిహారం చెల్లించేందుకు కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపుతామన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, నాయకులు రంగ, మనోహర్, బీసన్న, రామకృష్ణ, దస్తగిరి, షేక్‌షా తదితరులు పాల్గొన్నారు.

వందేళ్ల వైద్యాలయం



సెయింట్ థెరిసా జనరల్ (గోషా) హాస్పిటల్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కనున్న సెయింట్ థెరిసా జనరల్ హాస్పిటల్ (గోషా)కు వందేళ్లు నిండాయి. రెవ.మాథియాస్ వోల్ఫ్ నెదర్లాండ్స్‌లో చర్చిని ఏర్పాటు చేసేందుకు 1822లో సొసైటీ ఆఫ్ మేరీ జీసస్ మేరీ జోసఫ్ (జేఎంజే)ని స్థాపించారు.తెలుగు మాట్లాడే ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందించేందుకు ఆయన గుంటూరుకు సిస్టర్స్ (నన్స్) బృందాన్ని పంపించారు. 1904 ఫిబ్రవరి 28న వారు గుంటూరు వచ్చి సేవలు ప్రారంభించారు. ఆ తర్వాత అప్పటి మున్సిపల్ అధికారుల విన్నపం మేరకు రోమ్‌లో థెరిసా ఆఫ్ చైల్డ్ జీసస్‌ను సుందరీకరించిన రోజున కర్నూలులో 29-04-1923 సెయింట్ థెరిసా జనరల్ హాస్పిటల్‌ను ప్రారంభించారు. ఈ ఆసుపత్రి కర్నూలులోని పాతబస్తీ వాసులకు ప్రసూతి సేవలతో పాటు చిన్నపిల్లలకు వైద్య సేవలు అందిస్తోంది. ఎంతో మంది గొప్ప పదవుల్లో ఉన్నవారు, ప్రముఖులు ఈ ఆస్పత్రిలో జన్మించి ఉండడం విశేషం. ఇప్పటికీ నామమాత్రపు రుసుముతో మాతా శిశు సేవలతో పాటు జనరల్ సర్జరీ, జనరల్ ఫిజీషియన్ సేవలను సైతం అందిస్తున్నారు. అంతేగాక ఫిజియోథెరపీ, నర్సింగ్, హెచ్‌ఐవీ రోగులకు కౌన్సిలింగ్, వైద్యశిబిరాల ఏర్పాటు వంటి సేవలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ రోగులకు చికిత్సను అందించేందుకు గాను ప్రత్యేకంగా నందికొట్కూరు రోడ్డులో కేర్ అండ్ సపోర్ట్ సెంటర్(శాంతినికేతన్)ను సీనియర్ మార్టిన్ మాలికల్, సీనియర్ అగస్టీన్ పీటర్స్ నిర్వహిస్తున్నారు. గోషా హాస్పిటల్ పాత భవనాన్ని ఆధునీకరించేందుకు 2001 నుంచి 2005 వరకు పనులు జరిగాయి. 2011లో అవసరమైన పరికరాలతో ఐసీయూను ప్రారంభించినట్లు హాస్పిటల్ ఎంఐఆర్‌డీ డాక్టర్ మన్సూర్ రహమాన్ తెలిపారు.

గోషా ఆసుపత్రి పేరు ఎలా వచ్చిందంటే..

నగరంలోని గోషా ఆసుపత్రికి ఎంతో పేరుప్రఖ్యాతలు ఉన్నాయి. సెయింట్ థెరిస్సా జనరల్ ఆసుపత్రి అనే బోర్డు ఉన్నా.. గోషాసుపత్రిగానే ప్రాచుర్యంలో ఉంది. ఆసుపత్రి ఏర్పాటై సంవత్సరాలు గడుస్తున్నా పిలుపులో వినిపించే పేరు వెనుక అసలు కథ తెలిసిన వారు చాలా అరుదు. వాస్తవానికి ఆసుపత్రి చుట్టుపక్క ప్రాంతంలో ఒకప్పుడు ముస్లింలు అధికంగా నివాసం ఉండేవారు. వీరందరికీ ప్రసూతి, ఇతర వైద్య సేవలకు ఈ ఆసుపత్రి పెద్ద దిక్కుగా నిలిచింది. అయితే ముస్లింలు ధరించే బురఖాలు, ఆసుపత్రిలో చికిత్స అందించే మహిళా క్రైస్తవ వైద్యులు కూడా బురఖాలను పోలిన దుస్తులనే ధరించేవారు. వీటిని ముస్లింలు గోషాలు(పరదా)గా పిలుస్తుండటం, వీటిని ధరించిన వైద్యులు సేవలందిస్తున్న ఆసుపత్రి కావడంతో గోషాల ఆసుపత్రిగా, ఆ తర్వాత కాలంలో గోషా ఆసుపత్రిగా పేరు స్థిరపడింది.

ఇంటర్ టాపర్లకు అభినందన

కర్నూలు సిటీ: స్థానిక బీక్యాంపులోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇటీవల వెలువడిన ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులైనట్లు కాలేజీ ప్రిన్సిపాల్ శీల సౌజన్య తెలిపారు. శుక్రవారం ఆ కాలేజీ ఆవరణలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కళాశాల విద్యార్థులు బి.అస్రిత శేషాద్రి 937/1000 (హెచ్‌ఈసీ), ఎంపీసీలో సి.ధరణి 925, బైపీసీలో బి.హరిత 893, సీఈసీలో సి.నవీన్ 905, ఎంఈసీలో బి.మహేష్ 726 మార్కులతో టాపర్లుగా నిలిచారన్నారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో ఎస్.తరుణ్ 377/470, బైపీసీలో పి.ఫరీనా 410/440, సీఈఈలో భరత్ 399/440, ఎంఈసీలో బి.ధీరజ్ 416/500 మార్కులతో టాపర్లుగా నిలిచారన్నారు. ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇంటర్మీడియేట్‌లో మెరుగైన ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ రంగస్వామి నాయక్ తెలిపారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఎస్.సతీష్ 947 మార్కులు (సీఏఎస్ఈ), కె.ఉష 936 (సీజీటీ), సి.రేణుక 936 (ఎంపీహెచ్‌డబ్ల్యూ), ఎస్.అజేయుడు 914 (ఎంఎల్‌టీ), జి.శ్రావణ్‌కుమార్ 856 (అర్టిఫీషియల్ టెక్నాలజీ), డి.పి గోవర్ధన్ 834 (ఈఈటీ), పి.అశ్విని 828 మార్కులు, ప్రథమ సంవత్సరంలో సి.మహేష్‌బాబు 448/500 (సీజీటీ), సి.యశోద 446 (ఎంపీహెచ్‌డబ్ల్యూ), సోమనాథేశ్వరీ 445 మార్కులు, ఎస్.ఇర్ఫాన్ 406 మార్కులు సాధించారన్నారు.

నృత్య పోటీలు అదుర్స్



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: కళలు సంస్కృతికి ప్రతిరూపాలని సౌత్ ఏషియా ఫెటర్నిటీ యూత్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు సత్యపాల్ అన్నారు. కర్నూలు నృత్యజ్యోతి కళా సంస్థ 23వ వార్షికోత్సవం పురస్కరించుకొని నగర శివారులోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాల ఆవరణలో మూడు రోజుల పాటు జరగనున్న సౌత్ ఏషియా పీస్ కాన్ఫరెన్స్, ఇండియన్ డ్యాన్స్ ఫెస్ట్ వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సత్యపాల్ మాట్లాడుతూ పిల్లలకు ఇష్టమైన రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. నృత్య జ్యోతి కళా సంస్థ కార్యదర్శి, డ్యాన్స్ మాస్టర్ డాక్టర్ కె.వి. భార్గవకుమార్ మాట్లాడుతూ 15 రాష్ట్రాల నుంచి సుమారు 175 మంది కళాకారులు ఫెస్ట్‌లో పాల్గొంటున్నారన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అంతకు ముందు అతిథులు సత్యపాల్, టీజీ భరత్‌తో పాటు సౌత్ ఏషియా ఫెటర్నిటీ యూత్ ఆర్గనైజేషన్ సభ్యులు దీపక్, మాల్వి, గౌరీ బిల్లరి జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు.

కష్టజీవుల పక్షపాతి శ్రీశ్రీ

కర్నూలు కల్చరల్: కష్టజీవుల పక్షపాతిగా నిలిచిన మహా కవి శ్రీరంగం శ్రీనివాసరావు అని కర్నూలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున అన్నారు. శుక్రవారం టీజీవీ కళాక్షేత్రం సాహితీ వేదికలో శ్రీశ్రీ జయంతిని పురస్కరించుకొని పాటలు నిర్వహించారు. న్యాయవాది రామసుబ్బారెడ్డి, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, స్ఫూర్తి విజ్ఞాన కేంద్రం కన్వీనర్ జె.ఎస్.శేషయ్య మాట్లాడారు. ప్రజా నాట్య మండలి గాయకులు ఎం.పి.బసవరాజు, మధుర కవి ఎలమర్తి రమణయ్య, పార్వతయ్యలు శ్రీశ్రీ పాటలు, పద్యాలను ఆలపించి అలరించారు. పోటీల్లో 35 మంది గాయకులు పాల్గొన్నారు.

యువగళం అట్టర్ ఫ్లాప్



- లోకేష్‌కు లోకజ్ఞానం లేదు
- అడ్డదారిలో మంత్రి అయి ఏం చేశారో చెప్పాలి
- టీడీపీ హయాంలో బీసీలకు చేసిందేమీ లేదు
- పదవులిచ్చి సముచిత స్థానం కల్పించిన వైఎస్సార్‌సీపీ
- బీసీల అంశంపై చర్చకు సిద్ధమా?
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య

కర్నూలు(రాజ్‌విహార్): టీడీపీ నేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ప్రజా స్పందన లేక అట్టర్ ఫ్లాప్ అయిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. యాత్రలో లోకేష్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడని, అతనికి లోకజ్ఞానం లేదన్నారు. టీడీపీ హయాంలో బీసీలకు ఏదో చేశామని చెప్పడం విడ్డూరమని, పనికిరాని పనిముట్లు ఇచ్చి కుల వృత్తులకే పరిమితం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. నాయీ బ్రాహ్మణుల తోకలు కత్తిరిస్తానని చెప్పడంతో పాటు ఇతర కులాలను కించపరిచి మాట్లాడారని గుర్తుచేశారు. 14 ఏళ్లు సీఎంగా ఉండి చంద్రబాబు ఏమీ చేయకపోయినా చేసినట్లు లోకేష్ చెప్పడం హాస్యాస్పదమని, అడ్డదారిలో మంత్రి అయిన లోకేష్ ప్రజలకు ఏమి చేశాడో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాయమాటలు చెప్పి మోసగించిన టీడీపీకి గత ఎన్నికల్లో ప్రజలు చావు దెబ్బ కొట్టినా బుద్ధి రాలేదని, ఇప్పుడు పాదయాత్రలో చెప్పే తప్పుడు మాటలను ఎవరూ నమ్మబోరన్నారు. రాష్ట్రంలో బీసీలకు పెద్దపీట వేసిన పార్టీ తమదేనని, బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదు.. బ్యాక్ బోన్ క్లాస్, బెస్ట్ క్లాస్ అని చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బీసీలకు అనేక పదవులు ఇచ్చి సామాజికంగా, రాజకీయంగా గుర్తింపు కల్పించారని, 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్లు, డైరెక్టర్లను నియమించారని, 50శాతానికి పైగా పదవులు కల్పించిన ఘనత తమదేనన్నారు. బీసీలకు తమ ప్రభుత్వం కల్పించిన అవకాశాలపై లోకేష్ చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వరరెడ్డి, నాయకులు ధనుంజయ ఆచారి, లక్ష్మీకాంతయ్య, విద్యార్థి విభాగం నాయకుడు ప్రశాంత్ పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే జగనన్న ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోతుల సునీత

కర్నూలు(రాజ్‌విహార్): మహిళల సంక్షేమం, సంరక్షణే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని శాసన మండలి సభ్యురాలు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత స్పష్టం చేవారు. శుక్రవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక స్త్రీల భద్రతకు చట్టాలు తీసుకొచ్చారన్నారు. నామినేటెట్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించి పక్కాగా అమలు చేస్తున్నారని, దీంతో స్థానిక సంస్థలు, కాంట్రాక్టు పనులు, కార్పొరేషన్ పదవుల్లో స్త్రీలు కొలువుదీరారన్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా రాజకీయంగా, సామాజికంగా ఎదిగేలా అవకాశాలు కల్పించారని, దీంతో సమాజంలో స్త్రీలకు గౌరవం పెరిగిందని చెప్పారు. 90 శాతం మంది మహిళలు ప్రభుత్వ పాలనపై సంతృప్తితో ఉన్నారని, పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ద్వారా కోటి ఇళ్లను సందర్శించిన సందర్భంలో పూర్తి మద్దతు తెలిపారని పేర్కొన్నారు. సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక అసత్య ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు ఎల్లో మీడియాతో కలిసి విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు హయాంలో మహిళలకు భద్రత కరువైందని, లోకేష్‌కు దమ్ముంటే పేద ప్రజల వద్దకు వెళ్లి సెల్ఫీ దిగాలన్నారు. నాడు అమరావతి నిర్మాణానికి కేంద్రం రూ.700 కోట్లు ఇస్తే చంద్రబాబు దోచుకున్నారని, పోలవరం ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకున్నారని దుయ్యబట్టారు. కర్నూలు నగర డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, అవుకు జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖకు వర్షం దెబ్బ

కర్నూలు(రాజ్‌విహార్): అకాల వర్షాలు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థపై తీవ్ర ప్రభావం చూపాయి. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు 11 కేవీ స్తంభాలు - 164, ఎల్‌టీ విద్యుత్ స్తంభాలు - 185, 33 కేవీ స్తంభాలు నాలుగు విరిగిపోయాయి. దీంతో పాటు 52 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో మెటీరియల్, లేబర్ చార్జీలు కలిపి రూ.1.30 కోట్లు నష్టం వాటిల్లినట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్స్ ఎస్ఈ ఉమాపతి వెల్లడించారు.